క్లుప్తంగా

సత్యసాయి సేవా సంస్థల సేవలు అభినందనీయం



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా సత్యసాయి సేవా సంస్థలు భక్తులకు అందించిన సేవలు అభినందనీయమని ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంస్థ ప్రతినిధి పూసపాటి సాయికృష్ణ ఈఓను కలసి తాము అందించిన సేవల గురించి వివరించారు. సుమారు 350 మంది సంస్థ ప్రతినిధులు భక్తులకు సేవలు అందించడం హర్షణీయమని ఈఓ కొనియాడి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

వడ్డేశ్వరంలో పగిలిన తాగునీటి పైప్‌లైన్లు

కార్పొరేషన్ ట్యాంకర్‌ల ద్వారా తాగునీరు సరఫరా

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలో రెండు చోట్ల తాగునీటి పైప్‌లైన్లు పగిలి తాగునీటి సరఫరాకు బుధవారం అంతరాయం కలిగింది. సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయిన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఎక్కడైనా, ఎప్పుడైనా తాగునీటికి అంతరాయం కలిగితే దగ్గరలోని సచివాలయంలో ఫిర్యాదు చేస్తే తాగునీటిని అందజేస్తామని ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

రూ.81 వేల విలువైన మద్యం బాటిళ్లు మాయం

సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌ల చేతివాటం

మంగళగిరి: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి రూ.81 వేల విలువైన మద్యం బాటిళ్లు మాయమైన సంఘటన చోటుచేసుకుంది. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి జాతీయ రహదారి వెంటగల ఓ ప్రభుత్వ మద్యం దుకాణంలో అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించగా రూ.81 వేల విలువైన మద్యం బాటిళ్లు మాయమైనట్లు గుర్తించారు. సూపర్‌వైజర్ ఎం.శివతేజ సేల్స్‌మెన్లు వి.వెంకటేశ్వరరావు, బి.వంశీతో కలిసి మద్యం బాటిళ్లను అక్రమంగా అమ్ముకున్నట్లు నిర్ధారించారు. దీంతో నేరం ఒప్పుకున్న సూపర్‌వైజర్, సేల్స్‌మెన్లు వెంటనే నగదును జమ చేశారు. ఈ నేపథ్యంలో సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌లను విధుల నుంచి తప్పించినట్లు అధికారులు తెలిపారు.

పోలియో నిర్మూలనపై అవగాహన

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం వడ్డేశ్వరంలో పోలియో నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ పోలియో పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో టీకా వేయించాలని ప్రజలలో అవగాహన కల్పించారని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

అసోసియేషన్లు ఏర్పాటు చేయాలి

మంగళగిరి: నగరంలోని టిడ్కో గృహ నివాసితులు బ్లాకుల వారీగా అసోసియేషన్లను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సూచించారు. బుధవారం సాయంత్రం నగరంలోని టిడ్కో గృహ సముదాయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నివాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ టిడ్కో ఇళ్లలో బ్లాకుల వారీగా అందరూ అసోసియేషన్లుగా ఏర్పడి బ్లాకుల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, బ్లాకుల అభివృద్ధికి అసోసియేషన్లు కృషి చేయాలన్నారు. నివాసితులకు కృష్ణా నది నుంచి తాగునీటిని సరఫరా చేయడం జరిగిందని, తాగునీటి అవసరాలకు మించి నీటిని వృథా చేయరాదని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ యు.శారదాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాతూరులో కొత్త పెన్షన్‌లు అందజేత

తాడేపల్లిరూరల్: ప్రాతూరు సచివాలయంలో కొత్త లబ్ధిదారులకు బుధవారం నూతన పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఒక్క ప్రాతూరు గ్రామంలోనే కొత్తగా 23 పెన్షన్లు వచ్చాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా పెన్షన్లు పెంచుకుంటూ లబ్ధిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ ఎస్సీ సెల్ కన్వీనర్ సుంకర మణిబాబు, మాజీ సర్పంచ్ ప్రాతూరు మేరీరాణి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు అందజేస్తాం

- నియోజకవర్గంలో కొత్తగా 2,146 పెన్షన్లు
- మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి



శ్రీనివాస కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

తాడేపల్లిరూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పెన్షన్ అందుతుందని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవితో కలిసి కొత్తగా పెన్షన్ వచ్చిన లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో, మంగళగిరి నియోజకవర్గంలోనూ ఎక్కడో ఒకచోట అర్హులు కాని వారిని గుర్తించి పెన్షన్ తొలగిస్తే అందరి పెన్షన్లు తొలగిస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే 2,146 పెన్షన్లు కొత్తగా మంజురయ్యాయని తెలిపారు. పెన్షన్‌కు అర్హులై ఉంటే రాజకీయ నాయకులతో ప్రమేయం లేకుండా వలంటీర్ ఇంటికే వచ్చి పెన్షన్ అందజేస్తారని తెలిపారు. పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, వివిధ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు కృషి

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. బుధవారం ఆయన నగరపాలక సంస్థ అధికారులతో కలసి నగర పరిధిలోని కాజ రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కాజలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు రూ.10 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టడంతో పాటు పంప్ హౌస్ వద్ద సుమారు రూ.15 లక్షల వ్యయంతో నూతన ప్రెషర్ శాండ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు సురక్షిత తాగునీటిని నిర్ణీత వేళల్లో సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆర్ల రామయ్య, పార్టీ నాయకులు సింహాద్రి కోటిరెడ్డి, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన..

నగరంలోని జాతీయ రహదారి వెంబడిగల ఏపీఎస్పీ క్యాంపు రోడ్డు వద్దగల శ్రీనివాసకాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే బుధవారం పరిశీలించారు. క్యాంపు గేటు వద్ద నుంచి రోడ్డు వరకు గల ఆక్రమణలను స్థానికులు స్వచ్ఛందంగా తొలగించుకుని వెంటనే డ్రెయిన్, రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కేను కోరారు. స్పందించిన ఆయన నగరపాలక సంస్థ అధికారులను సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీనివాసకాలనీలో పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి త్వరలోనే పార్కును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, స్థానికులు పాల్గొన్నారు.

బాగుపడిన బోరుపంపు



బోరుపంపును రిపేరు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న బోరుపంపుకు బుధవారం మోక్షం లభించింది. కార్పొరేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డికి స్థానికులు వాట్సాప్ ద్వారా సమస్యను మెసేజ్ చేయడంతో వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి బోరు పంపును బాగు చేయించారు. కార్పొరేషన్ పరిధిలో ఎన్ని బోరుపంపులు ఉన్నాయి? అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయి? అనేవి సచివాలయంలో ఇంజినీరింగ్ సిబ్బంది వెంటనే పరిశీలించి ఎక్కడెక్కడ మరమ్మతులు నిర్వహించాలో తెలియజేయాలని కోరారు. ఎక్కడా కూడా బోరు పంపుల మరమ్మతులు పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి ఒక్క దానిని బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలియజేశారు. బోరుపంపులు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే స్థానిక సచివాలయాల్లో ప్రజలు ఫిర్యాదు చేయాలని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

కేఎల్‌యూ ఆధ్వర్యంలో జాతీయ క్రీడలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, డీన్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో క్రీడల విభాగం ఆధ్వర్యంలో కోనేరు లక్ష్మయ్య మెమోరియల్ ట్రోఫీ–2023 పోస్టర్‌ను బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ విడుదల చేసినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ క్రీడల్లో పురుషుల విభాగంలో బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో, చదరంగం పోటీలు నిర్వహిస్తుండగా, మహిళల విభాగంలో చదరంగం, బ్యాడ్మింటన్ సింగిల్, ఖోఖో క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జాతీయ స్థాయి క్రీడల్లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 91776 91248కు ఫోన్ చేసి తన పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్ హాస్పిటల్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాలో బీసీ తరగతుల హక్కులు, ఆర్థిక ప్రయోజనాలు పొందడంలో సఫలీకృతం కాలేకపోతున్నారని చెప్పారు. రాజ్యాధికారం పొందడంలో బీసీ తరగతుల వృత్తిదారులు అందరూ ఐక్యంగా కృషి చేపట్టాలన్నారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య ఫలాలు అనుభవించిన తరువాత కూడా రజకులు నేటికీ అణగారిన వర్గంగా దోపిడీకి గురవుతూ, అనేక ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బొజ్జ సుబ్బారావు, పాగోలు శ్రీనివాస్, ఈమని నాగలక్ష్మి, జిల్లా నాయకులు ఈమని రామారావు, మోర్ తోట సుబ్బారావు, వల్లభాపురం మస్తాన్‌రావు, ఓలేటి శ్రీను, నూతక్కి సాంబశివరావు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

మరణించినవారి పేర్ల తొలగింపునకు విచారణ చేయండి

తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణీంద్రబాబు

తాడికొండ: ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు తొలగింపునకు విచారణ చేసి జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు సూచించారు. తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికంగా నివాసం ఉండకుండా ఓటరు జాబితాలో లేనివారి వివరాలు సేకరించి ఉపాధి నిమిత్తం తరలివెళ్లారా? లేక శాశ్వతంగా ఇక్కడ నుంచి వెళ్లిపోయి ఓటు హక్కును కొనసాగిస్తున్నారా? అనే వివరాలతో జాబితా రూపొందించాలని సూచించారు. సిబ్బంది గ్రామాల్లో తిరిగి పూర్తిస్థాయి జాబితాను త్వరితగతిన రూపొందించేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో పనిచేయాలని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు సమస్యలను విన్నవిస్తున్న మహిళలు

ఫిరంగిపురం: వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. అల్లంవారిపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడికొండ నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ కలిసి పనిచేస్తారని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.2,750 చేసి అందించారన్నారు. 2023 నిఘంటువులో మరో కొత్తపదం చేర్చాల్సి ఉంటుందని, అదే బటన్ నొక్కడం అంటే దళారులతో పనిలేకుండా నేరుగా లబ్ధిదారుడికే నగదు అందేలా చూడటమని తెలిపారు. లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీకి అండ అని వారే జగన్‌ను మళ్లీ సీఎంగా చేస్తారన్నారు.

ప్రజలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత..

రాజకీయ సభలకంటే ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి ముఖ్యమని, వారిని కాపాడటమే ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. టీడీపీ నాయకులు కందుకూరులో నిర్వహించిన సభలో ఎనిమిది మంది ప్రాణాలు పోవడం, గుంటూరులో నిర్వహించిన సభలో ముగ్గురి ప్రాణాలు పోయి మరికొందరు గాయాలపాలవ్వడంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. అందువల్లే బహిరంగ ప్రదేశాల్లో సభలు నిర్వహించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా భావించి జీవో నంబరు–1 విడుదల చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం ఎందుకని, ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో ప్రజలు ఎందుకు చనిపోయారో దానికి టీడీపీ నాయకులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని చెప్పారు. అనంతరం అల్లంవారిపాలేనికి చెందిన మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

గోగినేని కనకయ్య చిరస్మరణీయులు

విద్యార్థులకు 4 సైకిళ్లు పంపిణీ చేసిన ఎన్ఆర్ఐలు



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

తాడికొండ: విద్యా ప్రదాత, విద్వాన్ గోగినేని కనకయ్య చిరస్మరణీయులని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. తాడికొండ ఎస్వీవీ ఉన్నత పాఠశాల, తెలుగు పండిత శిక్షణ కళాశాలతో పాటు పలు పాఠశాలల్లో గోగినేని కనకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పలువురు మాట్లాడుతూ విద్యా సంస్థల స్థాపకుడిగా తాడికొండతో పాటు గుంటూరులో అనేక పాఠశాలలు నిర్మించి గోగినేని కనకయ్య భావితరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, ఆస్ట్రేలియాకు చెందిన ఎన్ఆర్ఐ చెరుకూరి శ్రీధర్ రూ.20 వేల విలువ కలిగిన 4 సైకిళ్లను ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు టి.మల్లేశ్వరరావు, పి.గోపిచంద్, ఏవో డాక్టర్ అమల, హెచ్ఎం పెరికల దేవరాజు, పలువురు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలియో రహిత భారతదేశమే లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కేవీ సుబ్బరాజు

ఫిరంగిపురం: పోలియోరహిత భారతదేశమే లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ పనిచేస్తున్నట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కేవీ సుబ్బరాజు అన్నారు. మండల కేంద్రంలోని 1, 2, 3 సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న వ్యాక్సిన్ సెంటర్లను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన పోలియోరహితంలో భాగంగా వేస్తున్న ప్రాక్షినల్ ఇన్‌మార్టిన్ పోలియో వ్యాక్సిన్ వేస్తున్న తీరుపై పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్‌ను ఆరు నెలల నుండి 14 నెలల పిల్లలకు వేస్తామని బూస్టర్ డోస్‌గా భావించాలన్నారు. దీనిని ఇంజక్షన్ రూపంలో ఇస్తున్నట్లు తెలిపారు. 5 ఏళ్ల పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం వచ్చినట్లయితే ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. అది న్యూమోనియాగా మారితే ప్రమాదమని, ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం చేయించాలని చెప్పారు. దీనిపై ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ వీఎస్ఆర్ శాస్త్రి, వైద్య సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నాం



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

మేడికొండూరు: కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మేడికొండూరు మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ అందజేయాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడంతో పాటు, ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తున్నారన్నారు. గతంలో పింఛను మంజూరు కావాలంటే పింఛను తీసుకుంటున్నవారిలో ఎవరో ఒకరు మరణిస్తే ఆ స్థానంలో కొత్త పింఛను ఇచ్చేవారన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క అర్హుడికి పెన్షన్ మంజూరు చేస్తున్నామన్నారు. ఇటీవల కొన్ని కారణాలతో నోటీసులు జారీ చేసిన వారందరికీ తిరిగి రీవెరిఫికేషన్ చేసి వారికి కూడా తగు పింఛను అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెన్షన్ తొలగిస్తున్నారంటూ టీడీపీ దుర్మార్గ ప్రచారం చేస్తోందని, దీన్ని ప్రజలందరూ తిప్పికొట్టాలని ఎమ్మెల్యే శ్రీదేవి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మండల స్వప్నరాజేష్, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, రసూల్, ఉడతా శ్రీనివాసరావు, షేక్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రచార యావతో పేదల ప్రాణాలు బలి

వైఎస్సార్ సీపీ దుగ్గిరాల మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ప్రచార యావతో చంద్రబాబు చీప్‌పాలిటిక్స్ ప్రయోగిస్తున్నారని, బాబు సభలకు వచ్చి అమాయక పేద ప్రజలు చనిపోవడం బాధాకరమని వైఎస్సార్ సీపీ దుగ్గిరాల మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాలలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కందుకూరు, గుంటూరు ఘటనలు ఏపీ రాష్ట్ర రాజకీయ చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కందుకూరులో ఎనిమిది మంది, గుంటూరులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వాతాతలు, వితంతువులు, అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ను దశల వారీగా రూ.3 వేల వరకు పెంచుతానని ఇచ్చిన మాట ప్రకారం 2,750 రూపాయలు 2023 జనవరి 1 తేదీ నుంచి ఇస్తున్నారన్నారు.

టీడీపీ నేత సాంబశివరావుపై కేసు నమోదు

మంగళగిరి: తాడేపల్లికి చెందిన టీడీపీ నేత జంగాల సాంబశివరావుపై కేసు నమోదైనట్లు మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు. నగర పరిధిలోని చినకాకాని వద్ద ఏర్పాటు చేసిన మారుతీ టౌన్‌షిప్‌లో ప్లాట్లు విక్రయించడంలో తమను మోసం చేశారని బాధితులు ఒంటెద్దు కనకయ్య, నందం యశోదకుమార్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్లాటు కోసం రూ.40 లక్షలు తీసుకుని జంగాల సాంబశివరావు దగ్గర పని చేస్తున్న మట్టుపల్లి మహేష్ అనే వ్యక్తి తప్పుడు అగ్రిమెంట్లతో తమను మోసం చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మెల్లెంపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో బుధవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మాజీ పోప్ బెనెడిక్ట్ 16 ఇటీవల మరణించడంతో ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు సంఘ పెద్దలు విజయ్‌కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఉపదేశి బెజ్జం లక్ష్మణరావు, మండె సాల్మన్‌రాజు, పవన్‌కుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థినులతో టీడీపీ నేత కుమారుడి అసభ్య ప్రవర్తన

అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంగళగిరి: చినకాకాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల టీడీపీ నాయకుడు కటారి అప్పారావు కుమారుడు శివసాయి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన శివసాయిని ఉపాధ్యాయులు అడ్డుకోవడంతో వాగ్వివాదానికి దిగాడు. దీంతో ఉపాధ్యాయులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు వచ్చి శివసాయిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: నిద్రమత్తులో డ్రైవర్ అజాగ్రత్తగా కారు నడపటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కుంచనపల్లి 16వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన గ్రంధి సుబ్రహ్మణ్యం (42) పప్పుల మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆగిరిపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై పప్పుల మిల్లు పనిపై గుంటూరు బయలుదేరారు. కనకదుర్గ వారధి దాటిన తరువాత కుంచనపల్లి వద్ద కారు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం రోడ్డు డివైడర్‌ను ఢీకొని, ఎదురుగా ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న బాలరాజు నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కారు డ్రైవర్ బాలరాజును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.